సంపుటి 7

సంచిక 4

ఫోన్ నెం.

1087

రిజిష్టర్డ్ నెం.

A-103

ధరలనదుపులో

ఉంచేందుకు

సహాయపడండి.

* * *

దేశరక్షణకోసం

పొదుపుచేయండి.

ఎడిటర్ : జిల్లేపల్లి భాస్కరరావు.

శ్రీ క్రోధినామ సంవత్సర అధిక చైత్ర బహుళ పంచమి బుధవారం **1—4—64**

శక్తుల దుర్వినియోగం!

ప్రకృతి సర్వశక్తిసంపన్నము. అందుచే ప్రకృతిచేత ఆవరింపబడి ప్రకృతి చైతన్యావస్థకు లోనయి తిరిగే ప్రతిజీవి కొంత శక్తిని కలిగి వుండటం సహజం. అయితే మనకు శక్తి ఉన్నదని గుర్తించడానికి కొంత పరిశీలన అవసరము. పరిశీలకుడి దృష్టికి మంచిచెడ్డల విమర్శన కూడా తారసిల్లుతుంది, విమర్శకుడు తన స్థాయిని తాను నిర్ణయించుకొనటానికే ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నం అనేక ఒడుదుడుకులకు, వ్యాఖ్యానాలకు గురి అయినా తన శక్తిని తాను గుర్తింపగలుగుతాడు. ఈ విధంగా పరీక్షల మధ్య పరిస్థితుల ప్రాతినిధ్యంలో గుర్తింపబడిన శక్తిని ఏ మానవుడూ వ్యర్థపరచుకోడు. దీనికి కారణం కోల్పోయిన శక్తిని తిరిగి సంపాదించాలంటే మళ్ళీ మరొక జన్మకృషి ధారపోయాల్సి వస్తుందనే బెంగ అని చెప్పవచ్చును.

కొంతమందికి తమ శక్తి ఏమిటో తెలుసుకొనే తాపత్రయం ఉండదు. శక్తినెరిగి పని చేయటం వారి అలవాటు లేని విషయం అవుతుంది అందుచేత కాలానుగుణ్యంగా కలసి వచ్చిన పరిస్థితులమధ్య వ్యక్తిత్వపోకడ వెర్రితల వేసినా అవకాశాన్ని, అదృష్టాన్ని ఆసరాగా చేసుకుని తెచ్చుకున్న శక్తితో సాము సాగింప

చూస్తారు. యిలాంటిమనుష్యులందరూ ఒక్కొక్కప్పుడు బిల్లపడిపోవడం కద్దు.

పొరపడటం అనేది మానవశక్తికి మారు రూపంలో నూతనత్వాన్ని కలిగిస్తుంది. కాని మార్పుకు ప్రధానమయిన ఈ పొరపాటును పరిస్థితుల ప్రభావంతో జోడించి సరిదిద్దుకుని తిరిగి గాడికి వేయకపోతే అసలుశక్తికే భిన్నత్వము ఏర్పడుతుంది.

శక్తి పొందినవాడు లేక కలిగించుకున్నవాడు తన శక్తియొక్క సాఫల్యత పొందాలంటే దానిని సద్వినియోగ పరచి సోదర మానవ శ్రేయస్సుకు పూనుకోవటం ఉచితం. అలా కాకుండా శక్తి వైశిష్ట్యానికి స్వార్థమే ప్రధానమంటే "పెరుగుట విరుగుట కొరకే" అన్నట్లు పరిణామదశలో లోకకంటకంగా కనిపించే ఆ శక్తి ఛిన్నాభిన్నమయిపోవటం చరిత్రప్రసిద్ధం. అధికారం కూడా ఒకలాంటి శక్తినే అపాదిస్తుంది. సమాజనిర్మాణసూత్రావళికి సౌలభ్య జీవనం కోసం కట్టుబడి పనిచేసే మానవప్రగతిలో సూత్రానువర్తనా విధానానికి అధికార ప్రమేయం ఒక కేంద్రం లాంటిది. ఈ అధికారాన్ని వినియోగించటంలో ప్రణాళికా ప్రబోధితమయిన సర్వజనశ్రేయస్సు గుర్తింపబడకపోతే అధికార దుర్వినియోగం అయినట్లుగా గుర్తించడం జరుగుతుంది.

ప్రపంచపు పోకడలోనే భగవత్ప్రసాదితమయిన బుద్ధిబలానికి, ప్రకృతి ప్రసాదితమయిన పరిస్థితుల స్తోమతు ననుసరించి జరుపబడే శక్తులసమీకరణ దుర్వినియోగపరుపపడుట వలన శాంతి నశించి మానవసంక్షోభం కలుగుతుంది. దీనిని నివారించేందుకు ప్రవక్తలు ప్రబోధనల ద్వారా చైతన్యసమీకరణకు త్యాగంచేసి ఆత్మార్పణం కావించారు. ఈ ఆదర్శాన్ని మనమందరం గుర్తులో వుంచుకుంటే ఈనాడు వ్యక్తిగత స్వార్థం అనే విషయాసక్తితో పరిస్థితుల విషమావస్థను సృష్టించటం జరగదు. వర్గ, మత, జాతి భేద సూత్రమయిన కక్షలు సాగవు. అకారణయుద్ధాలు, విద్వేషవిషయాలు పెచ్చుపెరగవు.

ఈనాడు రవాణారంగంలో వివిధ రకాలయిన రవాణాలతో పోటీ సాగుతున్నప్పటికీ రాకపోకల సౌకర్యం భారతదేశంలో ముఖ్యంగా రోడ్ రవాణాపై ఆధారపడివున్నట్లు అభిజ్ఞుల అంచనా.

రాచరికపు పాలనా వ్యవస్థ మారి ప్రజాస్వామిక సిద్ధాంతాచరణీయత ఉపలక్షింపబడినప్పటికీ ప్రజలలో మనదేశము, మన వ్యవస్థ అనే భావనకు పరిశీలనకు పునాదులు లేనందువలన స్వప్రయోజనం అనేమారురూపంలో యింకా కంట్రాక్టు పద్ధతుల వ్యాపారమేసాగిపోవుచున్నది. అటు ప్రభుత్వాన్ని, యిటు ప్రజలను యిరకాటాన పెట్టి పరిశ్రమదారులు, పంపిణీదారులు, అభివృద్ధి సాధింపబడకుండా, అవరోధకంగా అనేక సమస్యలను తయారుచేయుటం, తద్వారా ప్రజాబాహుళ్య సౌకర్యం కుంటుపరచడం జరుగుతున్నది. దీనిని తొలగించేందుకు ప్రజలందరూ ప్రజాస్వామ్య సిద్ధాంత సూత్రావళి క్షుణ్ణంగా గ్రహించగలగాలి. చదువుసంధ్యలు లేకపోవటం సమాజపుపోకడలోని వేగానికి ఆటంకము ఏమో. కాని, చదువుసంధ్య లేకాక అభ్యాసమనే విశేష విజ్ఞాన సాధనవలన, మానవులు కావలసిన పరిణామాన్ని పొందగలుగుదురు. నిరుద్యోగ నిర్మూలనకు, పరిశ్రమల అభివృద్ధికీ, అనుభవ ప్రమాణంలో శిక్షణపద్ధతులద్వారా అభ్యాసాన్ని

పొందు పరిస్తే అభివృద్ధి అచంచలంగా సాగుతుంది. పాక్షిక దృష్టిని పెంపొందించు కొనవంత కాలం పరిశ్రమదారులకు, పనివారికీ ఎట్టివిభేద మూరాదు. దేశము, దేశప్రజ నావారే అనుకునే మనస్సుతో సాగించేకృషి దేశాభివృద్ధి తనవృద్ధిగానే రూపాంతరం కల్పిస్తుంది తాను వేరు, దేశంవేరు అనుకుంటేనే ఏ తగాయిదా అయినా ఏ నిరోధకమయినా తారసిల్లి అభివృద్ధి కుంటు పడుతుంది. ఈనాడు ప్రణాళికారచన సాగించే పెద్దలు చూపించేధోరణిలో దేశవ్యాప్తంగా సమానమయిన అభివృద్ధి కలిగించాలనే దృష్టి వున్నది. ఈ అభివృద్ధి సాధనకు ఆయా ప్రాంతములందు అమరివున్న పరిస్థితులనాధారం చేసుకుని ప్రణాళికారచనలు సాగుతుంటాయి. అంచనాలలో కొద్ది గొప్ప తేడావున్నా ఆచరణ సక్రమంగా సాగితే ప్రణాళికలో సూచించిన హద్దుల మేరకు అభివృద్ధిసాగుతుంది. రోడ్లనిర్మాణంలోనూ రోడ్లమీద నడపబడే శకటాల తయారీలోను వీటివలన సాధింపబడవలసిన భవిష్యత్తు కార్యక్రమం ద్వారా ప్రజలకు, పరిశ్రమదారులకు, ప్రభుత్వానికి మధ్యగా ప్రామాణిక సహకార సన్నిహిత్వం సాధించటంలోనూ, ఆచరణవిధానం నిర్దుష్టమై వున్నపుడు ప్రజావసరాలకు, అభిరుచికి అనుగుణంగా ప్రణాళికా నిర్మాణము, సాధనాప్రగతి అనువర్తనా పటిమ, సాగవలసివుంటుంది. అధికార వినియోగ దర్పంచేత ఈ విశిష్టభావ సమ్మేళనాన్ని ఏభారతీయుడు కించపరచటానికి వీలుకాదు. రాజ్యాంగ విధానంలో తమకు తమకుగల శక్తుల ప్రభావాన్ని పరీక్షలకు, పోటీలకు పెట్టి దేశంలో అరాచకాన్ని సృష్టించే స్థాయిలో మనం లేము. ఆ అరాచిక వాంఛే మనకు మంచిదికాదు. మనకేకాదు, మానవప్రగతికే మంచిదికాదు.

చట్టము మానవ జీవితాలను కట్టడికపై నడిపించటానికై వుద్దేశింపబడింది. కట్టడి తప్పిన వాడు శిక్షార్హుడే. కాని చట్టమే తెలియనివాడు ఏ కట్టడికపై నడుస్తాడు? చట్టాలు వాని ప్రబోధాలు ప్రజలకు అవగతమయినప్పుడే ధర్మం, న్యాయం, పునరుద్ధరింపబడి పరిపాలన ప్రామాణికంగా సాగగలదు. స్థితప్రజ్ఞ ముందంజ వేయగలదు. పాక్షిక దృష్టి నశింపగలదు. మానవులందరూ తమకు కలిగివున్న శక్తులను దుర్వినియోగ పరుపక సూత్రాచరణలోని సాధనా విశిష్టతకే వినియోగపరుచుట వలన అభివృద్ధిని మనము పొందగలము.

రవాణాసమాచార్

ఆంధ్రప్రదేశ్ నందు తెలుగులో ప్రచురింపబడు ఒకే ఒక రవాణాసమస్యలకు సంబంధించిన మాసపత్రిక.

సంవత్సర చందా	రు 3-00
విడిప్రతి	న.పై 0-25

ఆంధ్రప్రదేశ్యం దన్ని
"హిగిన్ బాథమ్స్"
రైల్వే బుక్‌స్టాల్సులోను, లోకల్ బుక్‌స్టాల్సులోను దొరుకును.

ఏజంట్లు లేని ప్రదేశమందు ఏజంట్లు కావలెను.

'రవాణాసమాచార్', విజయవాడ - 2

ఖమ్మం - చింతకాని జంట రైలుమార్గానికి ప్రారంభోత్సవం

సికింద్రాబాద్ సెంట్రల్ రైల్వే డివిజనల్ సూపరింటెండెంటు శ్రీ ఎన్ వై. మనోహర్ విజయవాడ, డోర్నకల్ సెక్షన్‌లో ఉన్న ఖమ్మం చింతకాని మధ్య గూడ్సుట్రాఫిక్ జంటరైలు మార్గానికి ఈరోజు ప్రారంభోత్సవం చేశారు. దక్షిణ భారతదేశానికి సరకులు, సామగ్రిని పంపుటకు సికింద్రాబాద్ డివిజనులో విజయవాడ - డోర్నకల్ సెక్షన్ చాలా ఉపయోగపడుతున్నది.

ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీ ఎ. రాధాకృష్ణ అతిథులకు స్వాగతం చెప్పారు శ్రీ ఎస్. వై. మనోహర్ జంటమార్గం గురించి మాటాడుతూ ఎర్రుపాలెంనుంచి విజయవాడ (25 మైళ్ళు) జంటమార్గానికి రు 2.65 కోట్లు డోర్నకల్ నుండి ఖమ్మం (14 మైళ్ళు) కు 1.52 కోట్లు ఖమ్మంనుండి ఎర్రుపాలెంకు (38 మైళ్ళు) రు 3.80 కోట్లు ఖర్చు అయినదని తెలియచేశారు. డోర్నకల్ సెక్షనులో పై జంటమార్గాలద్వారా ప్యాసింజరు, గూడ్సుట్రాఫిక్ ఎక్కువయింది. చింతకాని – ఎర్రుపాలెం మధ్య జంటమార్గం 1964 సంవత్సరాంతానికి పూర్తి అవుతుందని ఆయన తెలియచేశారు.

నిర్ణీతకాలంలో పనిని పూర్తిచేసినందుకు సిబ్బందిని- కార్మికులను, కంట్రాక్టరులను డిప్యూటీ ఛీఫ్ ఇంజనీరు (కన్‌స్ట్రక్షన్) శ్రీ ఎం. రామచంద్రన్ అభినందించారు.

జిల్లాపరిషత్ అధ్యక్షులు శ్రీ జలగం వెంగళరావు, శ్రీ కోట పున్నయ్య (ఎం.పి.) ప్రభృతులు సభకు హాజరయ్యారు. **

కాకినాడలో తపాలాఉద్యోగులసంఘం వార్షిక సమావేశం.

అఖిలభారత తపాలా ఉద్యోగుల సంఘం (మూడవ తరగతి) కాకినాడ శాఖ వార్షిక సమావేశం శ్రీ ఎం. ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. అఖిలభారత టెలిగ్రాఫ్ నాలుగవ తరగతి ఉద్యోగుల (ఆంధ్రసర్కిల్) సంఘం అధ్యక్షుడు శ్రీ సి. వి. కె. రావు ప్రారంభోత్సవం చేశారు.

నిర్ణీతకాలంకన్న ఎక్కువగంటలుపనిచేసేవారికి సరియైన భత్యం యివ్వించడానికి, జీవనవ్యయ సూచికలోని లోపాలను సవరింపచేయడానికి తమ సంఘం పాటుపడగలదని శ్రీ పి. పురుషోత్తమరాజు అన్నారు.

"జీవనవ్యయ సూచికలో కూలిపనిచేయు వారికి నెలకు రు 2-50 ల యింటి అద్దె నిర్ణయింపబడి వున్నది. 15 సంవత్సరాలనుంచీ యిదేమొత్తం యింటి అద్దెక్రింద నిర్ణయింపబడి వున్నది ధరలన్నీ విపరీతంగా పెరిగినప్పటికీ జీవనవ్యయసూచిక ఎప్పటివలెనే వున్నది." అని శ్రీ ఐ. బి. రామకృష్ణారావు అన్నారు.

తరువాత జరిగిన కార్యవర్గం ఎన్నికలలో దిగువ నుదహరించిన వారు ఎన్నికైనారు. అధ్యక్షుడు: శ్రీ ఎం. ఆర్. ప్రసాద్, ఉపాధ్యక్షులు: శ్రీయుతులు ఎన్. వి. యస్. శర్మ, ఎస్. శ్రీరామమూర్తి, కార్యదర్శి: శ్రీ వి వి. కృష్ణాచార్యులు సహాయకార్యదర్శులు: శ్రీయుతులు ఎన్. భాస్కరరావు. కె మహాలక్ష్మి, ఆర్గనైజింగ్ కార్యదర్శి: శ్రీ కె కృష్ణారావు.

పెద్దఓడలకు రాకపోకలకు వీలుగా విశాఖరేవు అభివృద్ధి

విశాఖపట్నం రేవులోకి ఓడలువచ్చేందుకు వసతులను, రేవులో యిప్పుడున్న వసతులను అభివృద్ధిపరచేందుకు రెండుపథకాలు పరిశీలనలో వున్నవని పోర్టుట్రస్టు అధ్యక్షుడు శ్రీ సి. ఆర్. రెడ్డి చెప్పారు.

శ్రీ సి. ఆర్. రెడ్డి విశాఖ రేవు మాజీ పరిపాలనాధికారి గత సాయంత్రము పోర్టుట్రస్టు (రేవు పరిపాలనామండలి) కు లాంఛనంగా ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఆయన యిలా అన్నారు.

"ఇప్పుడు విశాఖ రేవులోకి ఓడలు వచ్చేందుకున్న కాల్వను 650 అడుగుల మేరకు వెడల్పుచేసి ఆ తరువాత కాల్వను 45 అడుగుల లోతు చేయడానికి రూపొందించిన ఒక పథకం పరిశీలించబడుతున్నది. ఇందుకు రు. 3 కోట్లు ఖర్చవుతుంది. టర్న్ బేసినుకు రు. 1 కోటి ఖర్చవుతుంది. రెండవ కాలువను త్రవ్వేందుకు రూపొందించబడిన పథకముకూడా పరిశీలనలో వుంది. ఈ రెండుపథకాలకు సంబంధించిన దరియాప్తు జరుగుతున్నది. ఓడలనుండి సరకులను దించేందుకు, ఓడలలోకి మనుష్యులు పోయేందుకు వీలుగాను ఇప్పుడు రేవులోవున్న మూడు బెర్తులస్థానే రాతి కట్టడముతో బెర్తుల నిర్మించేందుకు కాల్వ వుత్తరపు పాయను లోతు చేయడానికి అదనపు రైలుమార్గాలు వేసేందుకు కూడా ఒక ప్రతిపాదన ఉన్నది. మొత్తము మీద విశాఖరేవు అభివృద్ధిచెంది తీరుతుంది. ముఖ్యమయినరేవు అవుతుంది.

విశాఖరేవు ఋణపడివున్న రు. 14 కోట్లపై సాలీనా రు. 37 లక్షలు వడ్డీక్రింద చెల్లించటం జరుగుతున్నది. రేవు చెల్లించవలసిన ఋణాలను కొట్టివేయ వలసిందిగా ప్రభుత్వాన్ని తప్పక కోరుతాము.

ప్రస్తుతము ఓడలు రేవులోకివచ్చేందుకున్న కాలువను 35 అడుగుల లోతు త్రవ్వటం 350 అడుగుల వెడల్పుచేయడం త్వరలో పూర్తవుతుంది. 635 అడుగుల పొడవు క్రిందనుంచి 35 అడుగులు (డ్రాఫ్టు) మాత్రము నీటిలో మునిగివుండు ఓడ—ఇండియన్ ఆయిల్ కంపెనీకిచెందిన ఆయిల్ టాంకర్ త్వరలో ఈ రేవుకు వస్తున్నది"

శ్రీ సి. ఆర్. రెడ్డి విశాఖరేవు పుట్టుపూర్వోత్తరాలను, అభివృద్ధిని క్లుప్తంగా పోర్టుట్రస్టు సభ్యులకు వివరించారు.

పోర్టుట్రస్టు సభ్యుడు శ్రీ కె. యస్. దత్తు మాట్లాడుతూ ఇలా అన్నారు. బొంబాయి, కలకత్తా, మద్రాసు రేవులకు నియమించిన పోర్టుట్రస్టులలో ఒక్కొక్కదానిలో 24 మంది ట్రస్టీలు వుంటుండగా విశాఖపట్నం పోర్టుట్రస్టులో అధ్యక్షునితోసహా 12 మంది ట్రస్టీలనే నియమించడ మెందుకు ? విశాఖ పోర్టుట్రస్టు అధికారాలుకూడా తగ్గించివేశారు. స్వయం నిర్ణయాధికారంకల యీ పోర్టుట్రస్టు ఛైర్మనుకు ట్రస్టీలపై విశ్వాసమున్నంత వరకు ట్రస్టీలకుకూడా అధ్యక్షునిపై విశ్వాసముంటుంది. సరకుల రవాణాను ఈ రేవుగుండా మళ్ళించేం

దుకు దోహదంచేసే పద్ధతులను రూపొందించ వలసినదిగా రాష్ట్రప్రభుత్వమును కోరాలి.

పోర్టుట్రస్టులో కార్మికప్రతినిధి శ్రీ బి జి. ఎం. ఏ నరసింగరావు మాట్లాడుతూ యిలా అన్నారు. రు. 14 కోట్ల ఋణము దానిపై అయ్యే వడ్డీ అంత పెద్దదేమీ కాదు. ఈ ఋణాన్ని కొట్టివేసేట్లు చూడటంలో అధ్యక్షునికి ట్రస్టు సహాయ సహకారాలన్నీ తప్పకవుంటవి. ఈ రేవుగుండా రవాణాచేయబడే సరకులలో 90 శాతము సరకులు ప్రభుత్వానికి చెందినవనీ, రేవు ఆదాయాన్ని వృద్ధిచేసేందుకు పోర్టుట్రస్టు ప్రభుత్వంనుండి వసూలుచేసే డబ్బును (లెవీని) పెంచ వలసివుంటుందని జ్ఞాపకముంచుకోవాలి.

శ్రీ సి ఆర్. రెడ్డి తుదిపలుకులు పలుకుతూ కొచ్చిన్, కాండ్ల, విశాఖపట్నం రేవుల పరిపాలనా మండలుల (పోర్టు ట్రస్టుల) విషయంలో చాలా అధికారాలను ప్రభుత్వము తానే వుంచుకుంటున్నదనటంనిజమేనన్నారు. సహాయభావాలను వెల్లడించినందుకు సభ్యులకు కృతజ్ఞతను వెల్లడించారు.

సరిగా పోర్టుట్రస్టుప్రారంభోత్సవసమయంలో రేవులో కార్మికులు సమ్మె చేశారు. శ్రీ మననాళి య్యను పోర్టుట్రస్టులో సభ్యునిగా నియమించినందుకు నిరసనగా కార్మికులు హఠాత్తుగా సమ్మె చేశారు, 3 గంటలసేపు మాత్రమే సమ్మె చేశారు.

మద్రాసులో బస్సురేట్లు : 30% వరకు పెరిగే సూచన.

మద్రాస్ ప్రభుత్వం జిల్లాల్లో తిరిగే బస్సు రేట్లను 2.% వరకు పెంచదలచారు. పట్నాల్లో తిరిగే బస్సులకు ఈ హెచ్చింపు వర్తించదు. మద్రాస్‌నగరములో ఈ హెచ్చింపు 30% వరకు అవుతుంది.

నగరానికి సంబంధించినంత వరకు అయిదు అంచెలతో 8 కిలోమీటర్ల (5 మైళ్ళు) కు 6 నయాపైసలు పెరుగుతుంది. ఇప్పుడు 19 నయాపైసలువుంది. దీనిని 25 నయాపైసలు చేయదలచారు. నగరము పట్టణ సర్వీసులకు సంబంధించి ప్రకటనలో మొదటిదశకు 10 నయాపైసలు, దరిమిలా ప్రతి అంచకు (దాదాపు రెండు కిలోమీటర్లు) 5 నయాపైసలు నిర్ణయించారు. ఇప్పుడు మూడు మైళ్ళకు 13 న.పైసలువసూలు చేస్తున్నారు. దీనిని 20 పైసలు చేయదలచారు.

—♦—

జపానులో రోడ్ల నిర్మాణ పథకం.

జపాను రోడ్ల నిర్మాణానికి గాను 1130కోట్ల డాలర్ల ఖర్చుతో 5 సంవత్సరాల పథకం తయారు చేయబడింది దానిని జపాను పార్లమెంటు ఆమోదించింది.

5 సంవత్సరాల జపాన్ బడ్జెట్ మొత్తంలో 30 శాతంగా వుంది

ఈ అయిదు సంవత్సరాలలోను మొదటి రెండు సంవత్సరాలలో 10 వేల కిలోమీటర్ల మొదటి రకం రోడ్లను పూర్తి చేస్తారు.

ఈ రోడ్ల నిమిత్తం కేటాయించిన మొత్తములో 80 శాతం నిర్మాణపు పనులకు, మిగిలినది నిర్వహణకు వినియోగిస్తారు. —*—

భారత జెట్ ఫైటర్‌కు రష్యా ఇంజన్ అమరని స్థితి

భారత విమానానికి అనుగుణంగా ఇంజన్‌ను మార్చే యత్నాలు విఫలం.

భారత్ జెట్ ఫైటర్ హెచ్ ఎఫ్ – 24 విమానానికి రష్యన్ ఆర్. డి– 9 ఏరో-యింజనును అమర్చే పథకాలు వాణిజ్యస్థాయిలో కార్యరూపం దాల్చక పోవచ్చును. ఎందుకంటే ఈ ఇంజనును సవరించటానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

మార్కు– 2 రకం ఫైటర్లకు అమర్చేందుకు ఇంక రష్యానుండి ఎటువంటి జెట్ యింజనును భారత్ దిగుమతి చేసుకోనక పోవచ్చునని బెంగుళూరు నుండి వచ్చినవార్తలు తెలుపుతున్నాయి.

భారత్‌లో నిర్మింపబడే ఫైటరు విమానానికి రష్యను ఇంజను బరువుగా వున్నదని, అందువల్ల ఇంజనులో కొన్ని మార్పులు అవసరమని కొన్నాళ్ళ క్రితం అధికారులు సూచించారు.

ఫైటర్ విమానం ఉత్పత్తికి సిద్ధంగా ఉన్నదని, త్వరలో ఇది ఐ. ఏ. యఫ్. స్క్వాడ్రన్ సర్వీసుకు లభ్యంకాగలదని రక్షణసామాగ్రి ఉత్పత్తిశాఖ మంత్రి శ్రీ కె రఘురామయ్య ఇటీవల వెల్లడి చేశారు. అన్ని కాలాలకు పనికొచ్చే రకం ఫైటర్ త్వరలో నిర్మింపబడుతుంది.

రష్యన్ డిజైనర్లు సవరింపులు చేయలేకపోతున్నారు, పైగా ఆర్. డి. 9 ఇంజనునురష్యాలో కూడా ఎక్కువగా ఆదరించడంలేదు.

భారత్ ఫైటర్ విమానానికి రష్యన్ ఇంజనును తీసుకుంటే భారత లైసెన్సుతో దానిని స్థానికంగా తగు సంఖ్యలో ఉత్పత్తి చేయాల్సి వుంటుంది.

భారత్‌కు మిగ్ ఫైటర్ల వాటి ఇంజన్లను ఉత్పత్తి చేసే ప్రాజెక్టు వుండనే వున్నది. ఇన్ని రకాల జెట్ ఇంజన ఉత్పత్తిలో మాస్కో సాయపడుతుందని ఆశించడం దురాశ.

దీని పర్యవసానం ఏమంటే విమానబలం ప్రధాన ఫైటర్ సాధనాల్లో హెచ్–ఎఫ్–24 ఒకటిగా ఉంటుంది. మిగ్ విమానాలు ఉత్పత్తి అయినప్పుడు అవి ఎలాగూ వుంటాయి.

విమానబలానికి హెచ్–ఎఫ్–24 విమానాలను అందజేయవలసిందిగా ఆర్డర్లను అప్పుడే యిచ్చారు.

ఆధునిక విమానా లన్నిటి మాదిరిగా దీనిని 'ఆయుధాగారం'గా మార్చే మరికొన్ని ప్రాజెక్టులను గూర్చి ఇప్పుడు పరిశీలన చేస్తున్నారు.

—:—

శ్రమదానంతో రోడ్డు నిర్మాణం.

స్థానిక బెసెంటు థియోసాఫికల్ కళాశాల సాంఘిక సేవాదళానికి చెందిన 60 మంది విద్యార్థులు విద్యార్థినులు ఇక్కడికి సమీపంలోని ఆచార్లపల్లి, చిన్నతిప్ప సముద్రం గ్రామాలలో శ్రమదానం చేసి రోడ్లు వేశారు. వీరికి శ్రీ ఎం. ఆనందరాజ్ నాయకత్వం వహించారు.

రాష్ట్రంలో రోడ్ల అభివృద్ధి

—అసెంబ్లీలో మంత్రి వివరణ

ఆంధ్రప్రదేశ్ శాసన సభలో కమ్యూనికేషన్లు, భవనాల పద్దుపై ప్రసంగిస్తూ మంత్రి శ్రీ బలరామిరెడ్డి ఈ విధంగా చెప్పారు.—

ఆంధ్రప్రదేశ్ మూడవ ప్రణాళిక కాలంలో రోడ్ల పొడవును అఖిల భారత సరాసరి స్థాయికి పెంచాలని సంకల్పించబడింది. అయితే దీనిని సాధించడమన్నది నిధుల లభ్యతపై ఆధారపడి వుంటుంది.

ఆంధ్రప్రదేశ్‌లో మూడవ ప్రణాళిక ప్రారంభం నాటికిగల రాష్ట్ర రోడ్ల పొడవు 10,033 మైళ్ళు. ఇందులో 6,4[illegible] మైళ్ళరోడ్లు ఆంధ్రప్రాంతంలోను, 3630 మైళ్ళ రోడ్లు తెలంగాణా ప్రాంతాలలోను ఉన్నాయి.

జాతీయ రహదారులు:— కొత్త పనులకు రు 73,92,00 లు నిర్వహణకు రు. 37,08,000లు 1964-65 సంవత్సరానికి కేటాయించడం జరిగింది.

అంతరరాష్ట్రీయ రోడ్ల పథకం క్రింద 1964-65లో భారతప్రభుత్వంవారు రు.5,63,000 లు కేటాయించవచ్చు అమలుపరచబడుతున్న కేంద్ర రోడ్డు నిధి పనులకు గాను 1964-65లో కేటాయించిన మొత్తం రు. 7,40,000 లు.

ఏజెన్సీరోడ్లపై 1964-65 లో రు 15,00,000 లను (ఆంధ్రలో రు 7,00,000లు, తెలంగాణాలో 8,00,000)ఖర్చుపెట్టడానికి ప్రతిపాదింప బడింది.

తెలంగాణా మిగులు నిధుల క్రింద పనులు ఇంతవరకు ప్రారంభించిన పనులకు అంచనావేసి మొత్తం ఖర్చు రు 2,42,87,000 లు ఇందులో రు 75,72,000 ల మొత్తం 1963 డిశంబరు ఆఖరు వరకు ఖర్చుపెట్టబడింది.

రాష్ట్రంలో రోడ్ల నిర్వహణ:- మూడవ ఫైనాన్సు కమీషను వారి అవార్డులో, రోడ్ల అభివృద్ధికి మూడవ ప్రణాళిక కాలంలో నాలుగేళ్ళపాటు 1962 - 63 నుండి 1965-66 వరకు) రాష్ట్రానికి సాలీనా రు 50,00,000 ల గ్రాంటు మంజూరు చేయబడింది. ఈసహాయం మూలంగా పరిస్థితి కొంత మెరుగు అవుతుంది. ఇందులో రు 40,00,000 మొ[illegible] ప్రభుత్వం రోడ్ల కోసం కేటాయించబడింది

మూడవ ప్రణాళికలోని రోడ్లక్రింద 1964-65 వ సంవత్సరానికి నిర్ణయించిన వినియోగం రు 1,70,00,000 లు (ఆంధ్రప్రాంతానికి రు 6300000 తెలంగాణా ప్రాంతానికి రు1,0700000

కార్యాచరణ బృందాలు

మొదటి మూడుప్రణాళికల కాలంలో సాధించినఅభివృద్ధిని బేరీజు వేయడానికి అంతేగాకుండా దీనిని దృష్టిలో పెట్టుకుని నాలుగవ పంచవర్ష ప్రణాళికలో చేర్చే నిమిత్తం ప్రతిపాదనలను రూపొందించడానికిగాను ప్రభుత్వంవారు రోడ్ రవాణా' అనే ప్రధాన కార్యాచరణ బృందాన్ని "రోడ్డు — వంతెనలు" అనే కార్యాచరణ ఉప బృందాన్ని ఏర్పాటుచేశారు.

తూర్పు పశ్చిమ గోదావరిజిల్లాలలో జాతీయ రహదారిపై నిర్మింపబడుతున్న గౌతమివంతెనకు

1964 – 65 సంవత్సరానికి రు 21,96,300 లు గ్రాంటు కావలసివుంటుంది. వసిష్టవంతెన 1964 డిశంబరు నాటికి పూర్తి అవుతుందని ఆశింపబడుతున్నది. ఈ పనిమీద 1964 – 65 సంవత్సరంలో రు 2700000 ల గ్రాంటుకు కావచ్చు.

భద్రాచలం వంతెనపై 1963 డిశంబరు వరకు రు 4650000లు ఖర్చు పెట్టబడింది. 1964-65 లో ఈ పనిపై రు 8,60,000 ల గ్రాంటు ఖర్చుచేయుటకు ప్రతిపాదించబడినద.

రాజమండ్రి వద్ద గోదావరికి అడ్డంగా రైలు రోడ్డు వంతెన ఏర్పాటుకు రు 2 కోట్లు ఖర్చు కాగలదని రైల్వేశాఖవారు రాష్ట్రప్రభుత్వానికి తెల్పారు. రాష్ట్రప్రభుత్వం 18 అడుగుల రోడ్డు వెడల్పు గల వంతెన నిర్మాణానికి కోటి రూపాయల పరిమితి మేరకు అంచనా ఖర్చులో సగం భరించుటకు తమ అంగీకారాన్ని తెల్పారు. యీ విషయమై భారతప్రభుత్వంతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడుతున్నాయి.

భవన నిర్మాణాలు

పెట్టుబడి పద్దుకు సంబంధించిన భవనాలకోసరం రు 2,92,54 700 మొత్తం కేటాయించబడింది. దీనిలో టూరిజం కోసం నిర్దేశించబడిన 2,55,000 మొత్తం చేరియున్నది.

ప్రణాళికేతర పథకాల క్రింద ప్రణాళికలకు వెలుపల మూడవ ప్రణాళిక కాలంలో రు 300 లక్షల మేరకు భవనములు ప్రతిపాదించబడినవి.

ముఖ్యమంత్రికి, మంత్రులకు భవనాల నిమిత్తం భూమిని సేకరించుటకు, వాటి నిర్మాణానికి 8 లక్షల మొత్తం ఖర్చుపెట్టడానికి ప్రతిపాదించబడింది. దీనికి అదనంగా హైదరాబాదు కార్యదర్శులకు, ఉప-కార్యదర్శులకు, సీనియరు ఆఫీసరులకు భవననిర్మాణానికి రు 4,104 లక్షల మొత్తం ప్రతిపాదించబడింది.

యిళ్ళకొరత ఎక్కువగా వున్న విషయం దృష్ట్యా బేగంపేటలో స్థలాన్ని సేకరించడానికి జూనియర్ ఆఫీసర్లకు, సిబ్బందికి, 4 వ తరగతి ఉద్యోగులకు గృహాలు నిర్మించి, వారికి గృహవసతి కల్పించడానికి రు 2[illegible] లక్షల కేటాయింపు డిమాండు చేయబడింది.

ప్రస్తుతం కొనసాగుతున్న పోలీసు గృహనిర్మాణ పథకాలకు హైదరాబాదు అంబరుపేటలో ప్రతిపాదింపబడిన కొన్ని కొత్త పథకాలకు ఖర్చునిమిత్తము రు 9 86 లక్షలు మొత్తం కోరబడింది.

“వైద్యశాఖ” క్రింద జిల్లా, తాలూకా ఆసుపత్రిల భవనాల నిర్మాణానికి రు 25 లక్షల ఖర్చు కోరబడింది.

వైద్యకళాశాలలు, ఆసుపత్రిలు, పాలిటెక్నిక్కులు, పారిశ్రామిక శిక్షణ సంస్థలు, సాంకేతిక సంస్థలకు హాస్టళ్ళు, తిరుపతి బాపట్లలలో వ్యవసాయకళాశాలలు, పశుచికిత్స ఆసుపత్రిలు, కోళ్ళపెంపకం కేంద్రాలు, డెయిరీ ఫారములు – వీటి నిర్మాణంలోను, విస్తరణలోను పనులు చాలా వేగంగా జరుపబడుతున్నందువలన ప్రణాళికా పథకం క్రింద డిమాండు పెరిగింది.

రాష్ట్రంలోని జిల్లాహెడ్ క్వార్టర్లు ఆస్పత్రులకు అభివృద్ధుల నిమిత్తం వైద్యం క్రింద రు11.54 లక్షలు కోరబడింది. “సాంకేతిక విద్య” క్రింద రు 24 60 లక్షల ఖర్చుతో సాంకేతిక సంస్థలకు హాస్టళ్ళుఏర్పాటు ప్రతిపాదననుగురించి పేర్కొనబడి వుంది. రాష్ట్రంలో అనేక చోట్ల పారి

ఖట్మాండు లాసా రోడ్డు

నేపాల్ రాయబారి వివరణ

లాసా రోడ్డు మూడునాలుగుసంవత్సరాలలో పూర్తి అవుతుందని అందువలన నేపాలుకు రాజకీయంగాను ఆర్థికంగాను కూడా లాభాలు కలుగుతాయని ఇచ్చట నేపాల్ రాయబారి శ్రీ కాళీ ప్రసాద్ ఉపాధ్యాయ నేడు పత్రికావిలేఖరులతో మాట్లాడుతూ అన్నారు,

ఈ రోడ్డు తాలూకు సర్వేపనులు పూర్తి అయినాయనీ, నిర్మాణపు పనిని ప్రారంభించడానికి చైనా సాంకేతికులు నేపాలు చేరుకున్నారని కూడా ఆయన చెప్పారు.

ఈ రోడ్డు నిర్మాణం పూర్తిఅయితే చైనాతో వ్యాపారసంబంధాలను పెంపొందించుకోనేందుకు వీలు కలుగుతుందని అంతేగాక నేపాల్ ఉత్తరప్రాంతాలలో నివసిస్తున్నవారికి ప్రభుత్వము చేయుగల అవకాశాలు ఏర్పడుతాయని కూడా ఆయన అన్నారు.

నేపాల్‌మీద చైనా దండయాత్రకు దిగదన్న అభిప్రాయాన్ని ఈ సందర్భంలో శ్రీ ఉపాధ్యాయ అభివ్యక్తం చేశారు. ఒకవేళ అట్లా దాడి చేయాలన్న భావం చైనాకు కలిగితే అందుకు ఈ రోడ్డుతో వారికి నిమిత్తం లేదని విశదం చేశారు.

నేపాల్ రక్షణ బలాభివృద్ధికి ఆంగ్లో- అమెరికన్ మండలం సహాయం చేస్తున్నందుకు ఆయన ధన్యవాదాలు తెల్పారు.

శ్రీ ఉపాధ్యాయ ఇంకా యిట్లా అన్నారు. “ఇప్పుడు ఈ లాసారోడ్డు మూలంగా నేపాలుకు చైనావల్ల సైనికంగా వచ్చే ప్రమాదం ఏమీ లేదు. చైనావారు మాకు సోదరులు. వారు మామీద దాడికి దిగుతారని మేము భావించడం లేదు. అయితే భారతదేశం మీద దాడి చేయడానికి చైనా పూనుకునే పక్షంలో, చైనావారు ఈ నేపాల్– టిబెట్టు రోడ్డును ఉపయోగించరనే ఆశిస్తున్నాము. భారతదేశం మీద చైనా దండయాత్ర చెయ్యాలంటే ఆ దండయాత్రను సాగించేందుకు మార్గాలు చాలా వున్నాయి. అందువల్ల ఈ రోడ్డు మూలంగా సైనిక ప్రమాదంసంభవించే అవకాశంఉన్నదని నేను అనుకోడం లేదు.

శాస్త్రీయ శిక్షణసంస్థలను స్థాపించవలెనని కూడా ప్రతిపాదించబడింది. “వ్యవసాయం క్రింద రు 81.50 లక్షల ఖర్చుతో వ్యవసాయ విశ్వవిద్యాలయ భవననిర్మాణానికి తిరుపతి వ్యవసాయకళాశాలలో 6 లక్షల ఖర్చుతో భవనాలకు, బాపట్ల వ్యవసాయకళాశాలలో రు 4.20 లక్షల ఖర్చుతో క్రొత్తభవనాల నిర్మాణానికి పథకాలను పేర్కొనవచ్చు. గన్నవరం వద్ద రు 4.55 లక్షల ఖర్చుతో ప్రాంతీయ బేకను ఫాక్టరీని, కాసరాయిపల్లి వద్ద రు 2.37 లక్షల ఖర్చుతో పచ్చితోళ్ళ స్లేయింగుక్యూరింగులో శిక్షణకేంద్రాన్ని స్థాపించవలెనని కూడా ప్రతిపాదించబడింది.

బస్సుల రవాణా జాతీయస్థితి

తృప్తికరంగాలేదని కేంద్రమంత్రి ప్రకటన

బస్సు ప్రయాణాలకు సంబంధించినంతవరకు రోడ్డురవాణా జాతీయంఅమలుజరిగిన తీరు, అభివృద్ధి, తృప్తికరంగా లేదని కేంద్ర రవాణా మంత్రి శ్రీ రాజబహదూర్ నేడు యిండియన్ యిన్‌స్టిట్యూట్ ఆఫ్ రోడ్ ట్రాన్సుపోర్టు వారిచ్చిన విందులో అంగీకరించారు.

రవాణా పరిశ్రమకు సంబంధించిన అన్ని రంగాలను జాతీయం చేయడం సాధ్యంకాదని ప్రభుత్వ - ప్రయివేటు వ్యవస్థల సహజీవనం సాగాలని సూచించారు. 1962 లో పోలిస్తే 1981 నాటికి "రోడ్డు హాలేజి" 20 రెట్లు పెరగ గలదని అంచనా వేశారు ఆపరేటర్ల రద్దీకి తగినట్లుగా సౌకర్యాలు కలిగించే నిమిత్తం తమ శక్తి సంపదలను సమకూర్చుకోవాలని కోరారు. డ్రయివర్ల మెకానిక్కులశిక్షణపాఠశాల ఏర్పాటుకు ఈ సంస్థ పథకం వేసినందుకు అభినందించారు. ప్రభుత్వం అమలుచేసే అధికారుల శిక్షణ కార్యక్రమంలో ప్రయివేటురంగం ఉద్యోగులను కూడా చేర్చుకొనేసంగతి ఆలోచిస్తామన్నారు.

బొంబాయిలో ట్రాంలకు స్వస్తి

ఏప్రిల్ 1 నుండి అమలు

-o-

90 సంవత్సరాలుగా నగరంలో వున్న ట్రాముసర్వీసు ఏప్రియల్ 1 నుండి పూర్తిగారద్దయిపోతుంది.

ట్రాములను ఎత్తివేసే కార్యక్రమం 1953 ఏప్రియలులో ప్రారంభమయింది. ఈ సర్వీసులు గిట్టుబాటుగా లేనందునే బొంబాయి ఎలక్ట్రిక్ సప్లయ్, ట్రాన్సుపోర్టుసంస్థవారు దీనిని ఎత్తివేయాలనే నిర్ణయానికి వచ్చారు

ప్రస్తుతం నగరంలో తిరుగుతున్న ట్రాంల సంఖ్య 25 మాత్రమే. 1953 - 54 లో 253 ఉండేవి. ఒక్క దార్‌బోరి బంధ మార్గంలో తప్ప తతిమ్మా అన్నిమార్గాలలోను క్రితం 9 ఏళ్ళలో ట్రాంలు రద్దయిపోయాయి. తొమ్మిదేళ్ళ క్రితం రోజూ 550000 మంది ట్రాంలలో ప్రయాణం చేస్తుండేవారు. రోజు రు 33000 వస్తుండేది. యిప్పుడు ప్రయాణీకుల సంఖ్య 50 వేలకు, రాబడి రు ౬ వేలకు తగ్గింది.

యిప్పుడు బొంబాయిలో 1050 బస్సులు ఉన్నాయి. సిటీలో రోజూ 1800000 మంది ప్రయాణం చేస్తున్నారు, రు 236000 రోజూ వసూలవుతుంది. ట్రాములు పూర్తిగా ఎత్తివేస్తున్నందున ఏప్రిల్ 1 నుంచీ మరో 80 బస్సులు అదనంగా వేస్తారు.

రైల్వేమండలాల పునర్విభజన : ప్రత్యేకసంఘ నియామకం

—మంత్రి శ్రీ దాసప్ప వివరణ.

రైల్వేమండలాలను పునర్విభజించే విషయాన్ని రైల్వే మంత్రిత్వశాఖ పరిశీలిస్తున్నదనీ, ఇందుకు గాను ఒక సంఘం నియమించబడినదనీ కేంద్ర రైల్వేఉపమంత్రి శ్రీ హెచ్. సి. దాసప్ప చెప్పారు.

నేటి సాయంత్రం ఇక్కడ పత్రికా విలేఖరులతో మాట్లాడుతూ ఆయన ఇంకా ఇలా అన్నారు. రైల్వేల పరిపాలనను మెరుగు పరచేందుకు రైల్వే మండలాల పునర్విభజన విషయము పరిశీలించబడుతున్నది పునర్విభజనానంతరం ఏర్పాటయ్యే రైల్వేమండలాలలో ఒక్కొక్కదాని అధికారం క్రింద ఉండే ప్రాంతము (మైలేజి) 6 వేల మైళ్ళకు లోపుగానే వుంటుంది.

రైల్వే మండలాల ప్రధాన కార్యస్థానాలూ, వర్కుషాపులను ఎక్కడ ఏర్పాటు చేయవలసిందీ పై సంఘము పరిశీలిస్తుంది. హుబ్లీ రైల్వే మండలాన్ని ఏర్పాటు చేయాలన్న కర్ణాటక కోరిక పరిశీలించబడుతున్నది.

దేశంలో వ్యాగనుల కర్మాగారాన్ని నెలకొల్ప వలసి వున్నది. అయితే దీనిని ఎక్కడ నెలకొల్పాలన్న విషయాన్ని పరిశీలించేందుకు ఏక సంఖ్య సంఘము నియమించబడినది. మైసూరు నగరంలో వ్యాగనుల కర్మాగారాన్ని నెలకొల్పే విషయము ఇప్పుడున్న వర్కుషాపు విస్తరణ పరిశీలనార్హములు. బెంగుళూరు–మైసూరు నగరాల మధ్య విద్యుత్ సహాయముతో రైళ్ళను నడిపే విషయము ప్రయాణీకుల రద్దీమీద, విద్యుత్ చౌకగా లభ్యమవటం మీద ఆధారపడి వుంటుంది.

బెంగుళూరు – మద్రాస్ రైళ్ళు మారికుప్పం మీదుగా మళ్ళించ బడుతవి. హాసన్–మంగుళూరు రైలు మార్గం పని మూడునెలల్లో ప్రారంభించ బడుతుంది. బెంగుళూరు రైల్వే స్టేషన రీమాడలింగ్ పని త్వరలోనే ప్రారంభించ బడుతుంది విశాల బెంగుళూరులో సబర్బన్ రైళ్ళను నడిపే విషయమై రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు నాకు ఇంకా అందలేదు."

-: మనవి :-

లోగడ చందాలు చెల్లించనివారు వెంటనే చెల్లింప ప్రార్థన. **1964** సంవత్సరపు చందాలు చెల్లించి పత్రిక ప్రగతికి తోడ్పడ గోరుతున్నాము.

— పబ్లిషర్

స్కూటర్ల వుత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించేసమస్య- ప్రభుత్వ పరిశీలన.

చతుర్థ ప్రణాళికలో స్కూటర్ల ఉత్పత్తిని స్వయంసమృద్ధి స్థాయికి పెంచే సమస్యను ప్రభుత్వం పరిశీలిస్తుందని ఉక్కు, గనులు, భారీ యింజనీరింగుశాఖలమంత్రి శ్రీ సి. సుబ్రమణ్యం నేడు లోక్ సభలో వెల్లడి చేశారు.

ప్రభుత్వం లాంబ్రెట్టా, వెస్పా స్కూటర్ల ఉత్పత్తిని పెంచడానికి ఉత్పత్తిదార్లకు అనుమతి యిచ్చిందని, వారు స్కూటర్ల ఉత్పత్తిని పెంచుతున్నారని ఆయన తెల్పారు. ఇంకా చతుర్థ ప్రణాళికలో ఎంతవరకు ఈ విస్తరణ కార్యక్రమాలను నిర్వహించవచ్చునో ప్రభుత్వం పరిశీలిస్తుందని ఆయన చెప్పారు.

మైసూరు రాష్ట్రంలో బస్సుసర్వీసుల జాతీయాకరణ.

రాష్ట్రంలో ప్రయాణీకుల రవాణా (బస్సు) సర్వీసు లన్నిటినీ జాతీయం చేయటాన్ని 4 వ ప్రణాళికా కాలంలో పూర్తి చేయాలని మైసూరు రాష్ట్ర రవాణా సంస్థ ఆలోచిస్తున్నదని రవాణా శాఖమంత్రి శ్రీ దేవరాజ ఉర్స్ మొన్న శాసన పరిషత్తులో చెప్పారు.

మైసూరు రవాణామంత్రి క్షమాపణ.

గత గురువారం శాసన సభకు తాను గైరుహాజరు అయినందుకు మైసూరు రవాణా శాఖ మంత్రి శ్రీ డి. దేవరాజఉర్స్ మొన్న శాసన సభ సభాపతికి బేషరతుగా క్షమాపణ చెప్పుకున్నారు.

తపాలా ఉద్యోగులకు ఇళ్ళ నిర్మాణం

—అనంతపురంలో స్థలపరిశీలన.

ఆంధ్ర సర్కిల్ పోస్టుమాస్టర్ జనరల్ శ్రీ సారంగపాణి ఇటీవల యిక్కడకు వచ్చి తపాలా శాఖోద్యోగులకు భవనాలనిర్మాణార్థం స్థలాన్ని పరిశీలించారు.

ఈ పట్టణములో కేంద్ర బట్వాడా కార్యాలయం(సెంట్రల్ డెలివరీ ఆఫీసుకు)గాను ఒక భవనాన్ని కట్టించేందుకుకూడా స్థలాన్ని పరిశీలించారు తాలూకా ఆఫీసుకు ఎదురుగా రెండుస్థలాలను, రైల్వేస్టేషను సమీపంలో ఒక స్థలాన్ని పోస్టుమాస్టర్ జనరల్ చూచినట్లు తెలుస్తున్నది.

ఆదివారము పోస్టల్ క్లియరెన్సుకుగాను ఇదివరలో హెడ్ పోస్టాఫీసులో మాత్రము వసతి ఉండేది. అట్టి వసతి జార్జిపేట పోస్టాఫీసులో కూడా కల్పిస్తామని పోస్టుమాస్టరు జనరల్ పత్రికా విలేఖరులకు చెప్పారు.

హంగరీనుంచి రైల్వే వంతెనలు.

భారతదేశానికి హంగరీ 35 రైల్వే వంతెనలను సప్లయి చేస్తుంది. ఒక్కొక్క వంతెన 45 టన్నుల బరువు వుంటుంది.

ఎలక్ట్రిక్ రైళ్ళు

జూన్ ఆఖరు నాటికి మొగల్‌సరాయ్, అలహాబాదుల మధ్య ఎలక్ట్రిక్ రైళ్ళు నడవ్వడం ప్రారంభమవుతుందని తెలుస్తోంది. కాన్పూర్-అలహాబాదుల మధ్య రైలు మార్గాల విద్యుదీకరణ వచ్చే ఏడాది సెప్టెంబరు నాటికి పూర్తి కావచ్చని సీనియర్ రైల్వే అధికారి ఒకరు చెప్పారు.

ఎక్స్‌ప్రెస్ డెలివరీ కవర్లు.

28 నయాపైసల స్టాంపు ఉబ్బెత్తుగాముద్రించిన ఎరుపురంగు ఎక్స్‌ప్రెస్ డెలివరీ కవర్లు ప్రవేశపెట్టబడతాయని తంతి తపాలా శాఖ ఉపమంత్రి శ్రీ భగవతి ఇవాళ రాజ్యసభలో ఖండేకర్ ప్రశ్నకు జవాబుగా తెలియజేశారు.

ఎక్స్‌ప్రెస్ ఉత్తరాలను త్వరగా బట్వాడా చేసేందుకు వీలుగా ఈ కవర్లు ప్రవేశ పెడుతున్నారట.

విశాఖరేవులో నిర్మాణపు పనులు.

విశాఖపట్నం రేవులో ఓడలకు ఇనప ఖనిజం యెత్తేందుకు వీలుగా మెకానికల్ ప్లాంట్ బెర్తుల నిర్మాణంలో మంచిది కాని, తప్పులు కల పథకాన్ని అనుసరించి నందున కలిగిన నష్టము రు. 10 లక్షలు అని అంచనావేయబడినది.

ఇటీవల జపాను సర్వే బృందము విశాఖ రేవును సందర్శించిన సందర్భంలో పై పొరపాటు బయటపడింది. సివిల్ ఇంజనీరింగు పనులలో కనబడిన లోపాలలో ఇదొకటి.

మంటాడ - శ్రీకాకుళం రోడ్డు.

ఆర్యా,

కృష్ణాజిల్లాలోని ముఖ్యమయిన రహదారి– "బందరు–హైదరాబాదు" రోడ్డునుండి, మంటాడ వద్ద చీలివచ్చిన కంకరరోడ్డు, కపిలేశ్వరపురం, వీరంకిలాకు, కృష్ణాపురం గ్రామాల మీదుగా చోరగుడి గ్రామం వరకు తొమ్మిది మైళ్ళు వచ్చి ఆగినది. అచ్చటినుండి శ్రీరంగపురం, లంకపల్లి గ్రామముల మీదుగా శ్రీకాకుళం వరకు అయిదు మైళ్ళ మట్టిరోడ్డు కలదు, ఈ రోడ్డుపై కంకర వేయించి, విజయవాడ గన్నవరం, గుడివాడల, నుండి బస్సులు నడుచు ఏర్పాటు చేయవలసిందిగా కోరుతూ ఇచ్చటి గ్రామస్తులేక అర్జీలను జిల్లా అధికారులకు పంపుకొని యుండిరి.

14–12–58 తేది "ఆంధ్రపత్రిక" లో ఈ రోడ్డు దుస్థితిని గురించి ప్రచురించిరి. అప్పుడు ఆంధ్రప్రభుత్వ ఆదేశానుసారం 8-2-59 తేదీన ఛీఫ్ ఇంజనీరు శ్రీదురాసీగారు ఈ జిల్లా హైవేసు యింజనీరుగారిని, యీ రోడ్డును మంచి స్థితిలోనికి తీసుకురావలెననెడి వుత్తర్వులు పంపిరి. వుయ్యూరు షుగర్ ఫ్యాక్టరీకి చెరకు తోలు బండ్ల రద్దీ అధికమైనది. రోడ్డు పూర్తిగా చెడిపోయినది. జిల్లాబోర్డువారు గాని, హైవేస్ ఇంజనీరు గాని తగు మరమ్మత్తులు చేయించలేదు. మరల ప్రజలాందోళన చేయుటయు, 29-3-62 తేదీనాటి ఆంధ్రపత్రిక శేఖలలో వుయ్యూరు ప్రాంతం రోడ్లను గురించి ప్రచురించటము జరిగినది. ఏవో స్వల్ప మరమ్మత్తులు చేయించిరే కాని బస్సులు తిరుగు ఏర్పాటు లేదు.

ఈ రోడ్డు కొన్ని శతాబ్దముల నాటిదనీ, ఆంధ్రరాజుల రాజధాని నగరమై శ్రీకాకుళం గొప్ప నగరముగా కూడలిగా విరాజిల్లినదని ఎల్లరూ యెరిగిన విషయమే. నేడు ఈ ప్రాంతమున వరి, చెరకు, పసుపు, మిర్చి, అపర ధాన్యాదులు మిక్కుటముగా పండుచున్నవి. వాటి రవాణాకు తగు రోడ్డును ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము వెంటనే వేయించి ప్రజలకు రవాణా సౌకర్యములు కలుగజేయ వలసియున్నదని ప్రభుత్వ ఆర్. టి. సి. బస్సులను నడిపవలయునని మనవి చేయుచున్నాను.

పాటిబండ్ల హనుమంతరావు. (చోరగుడి)

(ప్రెసిడెంటు, పట్టాభిసకలార్థ సహకార సంఘము)

శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తివినియోగం

మనం ఈనాడుఅణుయుగంలో వున్నాం. ఊహింపనలవికానంత సూక్ష్మాతి సూక్ష్మమైన పరమాణువు నుంచి వెలువడే బ్రహ్మాండమైనశక్తిని మారణహోమానికిగాని, మానవకల్యాణానికిగాని వినియోగించ వచ్చును.

అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించడం భారతదేశవిధానం. భారతదేశంచేపట్టిన బృహదభివృద్ధిప్రణాళికల నిర్వహణకు అణుశక్తిని వాడుకచేయాలని భారత ప్రభుత్వ సంకల్పం.

అణుశక్తి ద్వారా విద్యుచ్ఛక్తి నుత్పాదన చేయవచ్చును. అణుశక్తి వెలువరించేవి కిరణాలుకూడా వ్యాధి చికిత్సారంగంలో ఉపయోగపడతాయి. గొలుసుకట్టు మార్పు అనే పద్ధతి ద్వారా యూరేనియం నందు మూలపదార్థాల పరమాణువులను విచ్ఛేదంచేసి అణుశక్తిని ఉత్పత్తి చేయవచ్చు. ఈగొలుసుకట్టు మార్పు వెలువడే అణుశక్తిని ఉష్ణశక్తిగా మార్చేందుకు అణుశక్తి రియాక్టర్లు ఉపయోగపడతాయి. ఈ ఉష్ణశక్తిని ఆవిరిశక్తిగా మార్చి దానిలో టర్బైన్లు పనిచేయించి విద్యుత్తును ఉత్పాదన చేయ వచ్చును.

అణుశక్తి రియాక్టరు ఉత్పత్తి చేసే ఐసోటోపులు సమస్థానీయములు కూడా అనేక విధాల ఉపయోగ పడతాయి ఐసోటోపుల నుంచి ఈకిరణాలు వెలువడుతాయి. ఇది కూడా ఒక రకం శక్తే. ఊహకందని సూక్ష్మాతి సూక్ష్మమైన కొలమానాలకు కూడా యీ కిరణాలను ఉపయోగించ వచ్చును.

పరిశ్రమలు, వ్యవసాయం, వైద్యం, శస్త్ర చికిత్స యిత్యాదిరంగాలలోని వికిరణశక్తి వాడకంలో నవశకానికి నాంది ప్రస్తావన జరిగింది.

ప్రకృతి రహస్యాలను ఛేదించేందుకూ, కొత్త మూల పదార్థాలను ఉత్పత్తి చేసేందుకూ శాస్త్రజ్ఞులు అణువికిరణాలను ఉపయోగించు కుంటున్నారు. పోరిథిరిన్ వంటి కొత్త ఉష్ణ నిరోధక పదార్థాలను ఉత్పత్తి చేసేందుకు కూడా యివి ఉపయోగపడుతున్నాయి.

ఇక, వ్యవసాయ రంగంలో పంటకు తెగుళ్ళు పట్టకుండా నివారించేందుకూ, హెచ్చు దిగుబడి నిచ్చే కొత్తరకాల విత్తులనూ, నారునూ ఉత్పత్తి చేసేందుకుకూడా అణుశక్తిని వినియోగిస్తున్నారు. అంతేకాదు, ఆహార పదార్థాలను దీర్ఘకాలం పాటు నిలవవుంచేందుకు అణుశక్తి ఉపయోగించుకునే పద్ధతులపై యిప్పుడు శాస్త్రీయ ప్రయోగాలు సాగుతున్నాయి.

రోగ నిదానానికి, ఎక్స్‌రేల వలెనే ఐసోటోపులు కూడా ఉపయోగపడుతున్నాయి. కేన్సరు వంటి మారణ వ్యాధుల నివారణకు అణుశక్తి వికిరణాలను వినియోగించడం జరుగుతోంది.

భారత దేశంలో యిప్పుడు సమగ్రమైన అణుశక్తి పరిశోధనా కార్యక్రమం అమలు జరుగుతోంది. గత దశాబ్దంలో యీ రంగంలో సాధించిన ఫలితాలు సంతృప్తి కరమని చెప్ప వచ్చును.

ట్రాంబేలో మూడు అణుశక్తి రియాక్టర్లను నెలకొల్పారు. యిందులో కెనడా ఇండియా రియాక్టరు ప్రపంచంలో రియాక్టరులలో కెల్లా హెచ్చుగా ఐసోటోపులను ఉత్పత్తి చేయు శక్తిగలది. అణుశక్తి ఉత్పత్తి చేసే ఖనిజాలు ముఖ్యంగా థోరియం ఇండియాలో పుష్కలంగా లభిస్తున్నాయి. భారత దేశంలో థోరియం నిలవలు ప్రపంచంలో కెల్లా హెచ్చు. అణుశక్తి ఉత్పత్తికి అవసరమయ్యే ఖనిజాలను త్రవ్వి దీసి, ప్రాసెస్ చేసేందుకు యంత్రాగారాలు నెలకొల్పారు. నంగల్‌లో హెవీవాటర్ యంత్రాగారాన్ని ఏర్పాటు చేశారు.

బొంబాయికి సమీపాన ట్రాంబేలో నెలకొల్పిన అణుశక్తి సంస్థ మన దేశంలో పరమాణుశాస్త్ర పరిశోధనలకు ప్రధాన కేంద్రం. 1957లో ప్రారంభోత్సవం జరిగిన యీ సంస్థలో దాదాపు 1300 మంది యువశాస్త్రజ్ఞులూ, ఇంజనీర్లూ శిక్షణ పొంది అణుశక్తి రంగంలో పరిశోధనలు సాగిస్తున్నారు.

దేశంలో విద్యుచ్ఛక్తి అవసరాలు నానాటికి హెచ్చుతున్నందున, అణుశక్తినుంచి భారీ యెత్తున విద్యుచ్ఛక్తిని ఉత్పత్తిచేయాలని భారత దేశం తలపెట్టింది.

వాణిజ్య సాయిలో తొలి అణు విద్యుత్ కేంద్రం బొంబాయికి సమీపాన తారాపూర్ వద్ద నిర్మింప బడుతోంది. రు 48½ కోట్ల అంచనా వ్యయంతో నిర్మించబడుతున్న యీ అణువిద్యుత్కేంద్రం 1968 వ సంవత్సరారంభానికి బలతుల 80వేల కిలోవాట్ల విద్యుత్తునుఉత్పాదన చేస్తుంది. పరిశ్రమలు విస్తృతంగా అభివృద్ధి చెందిన మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు యీ కేంద్రం విద్యుత్తును సరఫరా చేస్తుంది.

రెండవ అణువిద్యుత్కేంద్రం రాజస్థాన్‌లో కోటారు సమీపాన రాణాప్రతాప్ సాగర్ వద్ద

నిర్మింపబడుతుంది. 1968 నాటికి నిర్మాణం పూర్తయ్యే ఆ కేంద్రం 2 లక్షల కిలోవాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేస్తుంది. తారాపూర్ అణువిద్యుత్కేంద్రం నమూనాలూ, నిర్మాణం విదేశ సాంకేతిక సహాయంతో సాగే రాణా ప్రతాప్ సాగర్ వద్ద నిర్మించ తలపెట్టిన అణు విద్యుత్కేంద్రం భారతసాంకేతిక విజ్ఞానుల పర్యవేక్షణ క్రింద నిర్మించబడుతుంది. మద్రాసు రాష్ట్రంలో మహాబలిపురం వద్ద నెలకొల్పబడే మూడవ అణువిద్యుత్కేంద్రం 4 లక్షల కిలోవాట్ల విద్యుత్తు నుత్పత్తి చేస్తుంది. 1969 నాటికి దాని నిర్మాణం పూర్తి అవుతుంది. నమూనాల తయారీ నిర్మాణపు బాధ్యతను భారత సాంకేతిక విజ్ఞానులే నిర్వహిస్తారు. బొగ్గు, చమురు ద్వారా విద్యుత్తును ఉత్పత్తి చేయడం కన్నా అణుశక్తి ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం చవుక.

ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడంలో అణుశక్తి వహించగల పాత్ర ప్రముఖమయినది. భారతప్రభుత్వం ఈ విషయాన్ని గుర్తించి అణుశక్తి రంగం పథకాలను రూపొందిస్తోంది.



భారతదేశంలో హెలికాప్టర్ విమానచోదకుల బృహత్తర కృషి

పశ్చిమ విభాగంలో నయితే నేమి తూర్పు విభాగంలో అయితేనేమి మారుమూల ప్రాంతాలలోని స్థావరాల నుంచి జబ్బు పడిన సైనికులను సాధ్యమయినంత శీఘ్రంగా చికిత్సా కేంద్రాలకు చేరవెయ్యడమే ఇప్పటికీ హెలీకాప్టరు విమానాలు నిర్వహించే ప్రధానమైన కృషి. ఈ రెండు ప్రాంతాల భౌగోళిక స్థితిగతులలో పోలికలు లేకపోయినా హెలీకాప్టరు విమానాలు ఈ ప్రాంతాలలో నిర్వహించేకృషి మాత్రం ఒక్కటే.

తూర్పు విభాగంలో కన్పించే లోయలు మరీ యిరుకైనవి. పర్వత సానువులు ఉష్ణ ప్రాంతంలో పెరిగే మొక్కలలో, ఎత్తుగా, ఏపుగా పెరిగిన మహా వృక్షాలతో నిండి ఉంటాయి. హెలీకాప్టరు దిగటానికి చదునగా ఉన్న ప్రదేశం కన్పించదు. చెట్లు చేమలూ, ఏపుగా, ఎత్తుగా, పెరగటంచేత నేల మీద సూర్యరశ్మి పడదు. తరచు మేఘచ్ఛన్నమై ఉండే ఈ అరణ్యాల వెనుక అత్యున్నత హిమాలయ పర్వత శిఖరాలు వ్యత్యాసం కొట్టవచ్చినట్లు కన్పిస్తాయి.

ఇక పశ్చిమ విభాగం స్థితి ఇందుకు కేవలం భిన్నమైనది. ఇది మరీ ఎత్తైన ప్రాంతం. ఎటు చూచినా మైళ్ళదూరం వ్యాపించిన ఎడారి కొండరాళ్ళు, అక్కడ వుండే ఇసుక, పిండిరాళ్ళ రంగునుబట్టి బూడిద రంగులో లేదా తెల్లగా నిరామయంగా కన్పిస్తాయి. ఎటు చూచినా నిర్జనంగా, ఎడారిలా కన్పించే ప్రాంతంలో ఎక్కడో అరుదుగా పది పన్నెండు చెట్లు లేదా పచ్చిక మైదానం కన్పిస్తే కన్నుల పండువే అవుతుంది. ఎడారిలో ఒయాసిస్ కన్పించినచో సంబర పడతారు. హెలీకాప్టరు విమాన చోదకులు కళ్ళు చెదర గొట్టే సూర్యకాంతికీ, చలికీ వారు అలవాటు పడవలసి కూడా వున్నది. ఇటు అరణ్య ప్రాంతమైనా, అటుఎడారిప్రాంతమయినా భారత వైమానిక శాఖ తాలూకు హెలీకాప్టర్ విమాన చోదకులు ఈ రెండు విభాగాలలో తమ విద్యుక్త ధర్మాన్ని ఉత్సాహంగా నెరవేరుస్తున్నారు. మారుమూల స్థావరాల నుండి జబ్బుపడిన సైనికులను అతి శీఘ్రముగా చికిత్సా కేంద్రాలకు చేరవేయడంలో వీరి కృషి ప్రశంసార్హమైనది.

—•—

సరకుల రవాణాకు చిన్నస్టీమర్లు.

చిన్న రేవుల నిమిత్తము చిన్నస్టీమర్లు, పడవలలో కోస్తా రవాణా సర్వీసును ప్రారంభించే వీళ్ళను గూర్చి భారత ప్రభుత్వమువారు పరిశీలిస్తున్నట్లు చిన్న రేవుల నిర్వాహణనివేదికద్వారా తెలుస్తోంది.

యాత్రికులకు:

ఈమధ్య ఆగ్రవ ఆలిండియా హోటల్ రెస్టారెంటు కాన్వొకేషన్‌లో విదేశీయ ప్రతినిధులు పాల్గొన్నారు. వారి అభిప్రాయానుసారంగా రాబోయే ప్రణాళికా కాలంలో భారతదేశమునందు అమెరికా యాత్రికులకు విహారయాత్రా అభినివేశ కుతూహలమున్నట్లున్నూ, తెలియచేయబడింది. అమెరికా యాత్రికులకు వసతి సదుపాయాలు అభివృద్ధి చేయబడితే భారతదేశమునందు యాత్రాభినివేశము పెంపొందగలదు.

♦ ♦ ♦

వివిధదేశాలకు సంబంధించిన యాత్రా బృంద ప్రతినిధులు సమావేశమయి కేంద్ర మంత్రి రాజబహదూర్ ప్రాతినిధ్యంలో యాత్రా సౌకర్యంవిషయమై చర్చలు సాగించారు. ఈ చర్చలయందు హిందూదేశయాత్రికులు విదేశాలకు పోయేటప్పుడు దేశీయంగా వున్న అనేక నిబంధనలను సడలించాలని సూచించబడింది.

♦ ♦ ♦

శాన్‌ఫ్రాన్సిస్కో-క్రానికల్ ట్రావెల్ ఎడిటరుగా ఉన్న మిస్ పోలీనాయిస్ తన ప్రపంచ యాత్రా పర్యటనలో ఈమధ్య భారతదేశపు పశ్చిమతీర ప్రాంతాన్ని దర్శించింది. ఈమె లోగడ టూరిస్టుడిపార్టుమెంటు ఆహ్వానంపై భారతదేశాన్ని దర్శించి భారతదేశంలో విహార యాత్రాచరిత్ర స్థలాలను, చరిత్రను, వేనోళ్ళ కొనియాడుతూ అనేక వ్యాసాలు వ్రాసింది ప్రస్తుతము యీావిడ సిడ్నీలో జరగబోయేపసిఫిక్ ప్రాంత యాత్రికుల సమావేశానికి వెళ్ళుతున్నది

అర్లి క్వీన్ పత్రిక సంపాదకుల పాలిటీ పార్టు భారతదేశాన్ని సందర్శించి యాత్రాస్థలాల విశేషాన్ని అభివర్ణిస్తూ క్వీన్ పత్రికలోనూ, అమెరికా పత్రికలోనూ అనేకవ్యాసాలు వ్రాసింది.

యాత్రాదర్శిని

రెండు వందల పేజీలు గల ఈ గ్రంథాన్ని భారతప్రభుత్వం ప్రచురించింది. దీనిఖరీదు 60-00లు. ఇందు భారతదేశమందలి ముఖ్యమైన పట్టణాలు, యాత్రాస్థలాలు. దానియొక్క చారిత్రాత్మక, పౌరాణిక, భౌగోళిక విషయ సమాచారాలతో పాటు ప్రయాణసౌకర్యము వసతి గృహ విశేషాలు. యాత్రాసౌలభ్యానికి పొందదగిన పర్మిట్లు వీసాలు వగయిరా విశేషాలు, పొందుపరచబడి వున్నవి.

♦ ♦ ♦

భాక్రానంగలు ప్రాజెక్టువద్ద భారతయాత్రా సంస్థవారి ఆధ్వర్యంలో 1.5 మిలియనుల రూపాయలు వెచ్చించి, యాత్రికులవినోదార్థం వసతులు కల్పించబడినవి. చోరుల ప్రయాణము, చేపలవేట, మొదలయినవేకాక యితర రకముల క్రీడావిన్యాసములకు ఏర్పాట్లు, చేయబడినవి. ఇచట 24 గదులు కల వసతి గృహాలు, ఆధునిక వసతులతో ఏర్పాటు చేయబడినది.

హైదరాబాదు - కల్వకుర్తి బస్సురూట్లు.

హైదరాబాదు నుండి కల్వకుర్తికి కడ్తల్, అమంగల్ మీాదుగా బస్సు రూట్లను జాతీయం చేసేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రతిపాదించిన పథకము ఆమోదించబడినదనీ, పర్మిట్ల కోసము ప్రాంతీయ రవాణా అధికారికి (మహబూబ్ నగర్) రాష్ట్రరోడ్డు రవాణా సంస్థ దరఖాస్తు చేసినదనీ, కార్పొరేషనుకు పర్మిట్లు శీఘ్రంగా మంజూరు అయ్యేట్లు చూడవలసిందని మహబూబ్ నగర్ జిల్లా కలెక్టరుకు విజ్ఞప్తి చేయడంకూడా అయినదనీ రవాణాశాఖ మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి శ్రీ పెద్దయ్యకు తెలియజేశారు.

రోడ్డురవాణా సంస్థ ప్రయాణీకుల అవసరాలు చాలవరకు తీర్చింది.

రోడ్డురవాణా సంస్థవారు ప్రయాణీకుల అవసరాల నన్నిటినీ చాలవరకు తీర్చారని నిన్న సాయంత్రం రవాణామంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి సికిందరాబాద్ రైల్వే స్టేషనువద్ద కార్పొరేషన్‌వారిచే నిర్మించబడిన బస్సు ప్రయాణీకుల నిలుకడ వసతికి ప్రారంభోత్సవం చేస్తూ అన్నారు.

ప్రారంభదశలో కార్పొరేషన్‌పై విమర్శ గాలిదుమారాలు చాలా రేగినమాట వాస్తవమేననీ, కాలంగడిచినకొద్దీ కార్పొరేషన్ కాలు నిలవద్రొక్కుకుని ఆ ఆక్షేపణల కన్నిటికీ క్రియాప్రధానంగా సమాధానం యిచ్చిందని శ్రీ గురుమూర్తి అన్నారు.

శ్రీ గురుమూర్తి తమ ప్రసంగంలో యింకా యిలా అన్నారు. ఆంధ్రప్రాంతంలో కూడా ఆర్. టి. సి. బస్సు సర్వీసులు బాగా తృప్తికరంగా సాగుతున్నవి. కర్నూలు జల్లానుండి బస్సులను తొలగించడంవల్ల చాలమంది నిరుద్యోగులు కాగలరనే భయం నిరాధారమని తేలిపోయింది. ఉద్యోగాలు కోల్పోయిన వారందరికీ యీ సంస్థలోనే ఉద్యోగాలు తిరిగి లభించినవి. తెలంగాణాలో బస్సులు కొరతగా వున్నవి. త్వరలోనే ఈ కొరత తీరగలదు. జంట నగరాలలోని పోలీసు పురపాలక సంఘు, రోడ్డు రవాణా సంస్థలు మూడూ ప్రయాణికులకు వలసిన వివిధ వసతి సౌకర్యాలు కల్పించడంలో చాల కలిసికట్టుగా పరస్పర సహకారంతో వ్యవహరిస్తున్నవి. కాని యింత మాత్రానికి రోడ్డు రవాణా సంస్థ తృప్తిపడి, చేతులు ముడుచుకుని కూర్చోటానికి వీలులేదు. ప్రయాణీకులనుఇతోధికంగా సుఖపెట్టడానికి శాయశక్తులా ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూనే ఉండాలి. దూరపు ప్రయాణ బస్సులను నడపడం రోడ్డు రవాణా సంస్థ ప్రత్యేకత. ఇప్పటికే 15 జిల్లా కేంద్ర పట్టణాలకు రాష్ట్ర రాజధానీ నగరంతో, వీటిమూలంగా సరాసరి రాకపోకల సంబంధ మేర్పడింది. ఎక్స్‌ప్రెస్సు బస్సులు కాని, దూరపు ప్రయాణ బస్సులు కాని 60 కి పైగా నడుస్తున్నవి.

రవాణా మంత్రికి స్వాగతం చెపుతూ రోడ్డు రవాణా సంస్థ చైర్మన్ వైస్ అడ్మిరల్ కటారి యిలా అన్నారు. 30 వేల రూపాయలఖర్చుతో నిర్మించబడిన యీ నిలుకడ వసతివల్ల చిరకాలంగా వున్న ప్రయాణీకుల అవసర మొకటి తీరినట్లైనది. రోజుకు 52 బస్సులు 289 పర్యాయాలు యిచటకు వచ్చి 31 వేలమంది ప్రయాణీకులను ఎక్కించుకోవడంగాని, దించడం కాని చేస్తున్నవి.

నగరంలో తిరిగే బస్సులలో చాలవరకు కాలం చెల్లినవి. వాటిని మరమత్తు చేసి సాఫీగా నడపటం సాధ్యం కాదు. వీటిస్థానే నూరుకొత్త రకం బస్సులను ప్రవేశపెడుతున్నాము. ఏప్రిలు 1 వ తేదీ నుండి హైదరాబాదు గుంటూరుల మధ్య మొట్టమొదటి సారిగా ఎయిర్ కండిషన్డు బస్సులను నడపటానికి నిశ్చయించడమైనది.

♦♦♦

అన్ని బస్సు మార్గాలలో సీజన్ టిక్కెట్లు.

ఏప్రియలు 1 నుండి అమలు లోకి వచ్చే బస్సు రేట్లను మద్రాసు ప్రభుత్వము త్వరలో ప్రకటించనున్నారు. కొత్త రేట్లను అమలు జరుపుటతో పాటు నగరములోని అన్ని బస్సుమార్గాలలో సీజను టిక్కెట్లు ఇచ్చే ఏర్పాట్లు చేయాలని నిశ్చయించారు. సీజను టిక్కెట్టు ఖరీదు 60 టిక్కెట్ల ధరలో మూడింట రెండు వంతులు వుంటుంది.

తిరుత్తని కొండమీదికి ఘాటురోడ్డు.

ఇక్కడ శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవాలయం వున్న కొండమీదికి, యాత్రికుల సౌకర్యార్థం, కార్లు, ఎడ్లబండ్లు, వగైరా వెళ్ళేందుకు వీలుగా ఘాట్ రోడ్డును వేయడానికి దేవాలయ పరిపాలక సంఘమువారు, పూనుకున్నారు. అనుభవజ్ఞుడైన ఇంజనీరు శ్రీ సి. నాగేశ్వరయ్యరు చేత ఎస్టిమేట్లు తయారు చేయించి, వాటిని ఆమోదించి ప్రభుత్వానుమతికై పంపారు.

మనీయార్డరు ఫారాలు

1964 మార్చి 1 వ తేదీకి ముందు జారీ చేయబడిన మనియార్డరు ఫారాలను ప్రజలు ఉపయోగించే టట్లయితే వాటిమీద తపాలాఫీసు ముద్రలేనప్పటికీ, అవి స్వీకరింపబడతాయని తంతి తపాలా శాఖ డైరెక్టరు జనరల్ (న్యూఢిల్లీ) ప్రకటించారు. అయితే అలాంటి సందర్భాలలో పూర్తి కమిషన్ వసూలు చేయబడుతుంది. తపాలాఫీసు తేదీ ముద్రలేని అలాంటి మని ఆర్డరు ఫారాలను ఏప్రిల్ 30 వరకు మాత్రమే స్వీకరిస్తారు.

సుప్రసిద్ధ రచయిత

శ్రీ అవసరాల సూర్యారావు

అస్తమయం

శ్రీ అవసరాల సూర్యారావు 20-3-64 వ తేదీ రాత్రి 10 గంటలకు దివంగతులయినారని తెలుపుటకు మేము ఎంతో విచారిస్తున్నాము. ఆధునిక సాహితీ ఆకాశం నుండి ఒక తార రాలి పోయింది. ఈయన రచనలలో "పంజరం" అనే నాటకానికి నాటకకళాపరిషత్ వారి బహుమతి లభించింది. ఈయన గురజాడ వారి రచనలకు పరిష్కృతం కావించారు. పింగళి లక్ష్మీకాంతం గారితో కలసి "పల్నాటివీర చరిత్ర"ను కూడ పరిష్కృతం చేశారు. వీరు విశాలాంధ్ర, ఆంధ్రప్రభ దినపత్రికలలో ఉపసంపాదకులుగా పనిచేసి విశిష్టమయిన ప్రతిభను చూపారు. జీవించినది 40 సంవత్సరాలయిననూ, సాధించినది రెండింతలు. వీరికి భార్య, ఆరుగురు సంతానం కలరు. వీరి అకాలమరణానికి యావత్ ఆంధ్ర సారస్వత సమాజం దుఃఖితమైనది.

తిరుపతి యాత్రికులకు అదనపు సౌకర్యాలు.

దేవస్థానం అధికారిగా ఐ. ఎ. యస్ ఉద్యోగిని నియమించాలని నివేదికలో సూచన.

యాత్రికులకు ఎక్కువగా సౌకర్యాలుకల్పించుటకు దేవస్థానం అధికారులు శ్రద్ధ వహించాలని, యాత్రికుల పట్ల దేవస్థానము వుద్యోగులు యింకా మర్యాదగా వ్యవహరించాలని కూడా సిఫార్సు చేశారు

తిరుపతి — తిరుమల దేవస్థానముపై 1963-64 తాలూకు అంచనాల సంఘం నివేదికను నేడు సంఘం అధ్యక్షులు శ్రీ టి వి రాఘవులు శాసనసభకు అందచేశారు.

సభాపతి శ్రీ బి. వి సుబ్బారెడ్డి అధ్యక్ష స్థానములో వున్నారు.

అంచనాలసంఘం మొత్తము 28 సిఫార్సులు చేశారు.

వానిలో కొన్ని ముఖ్యమయినవి ఏమన —

"దేవస్థానము ఎగ్జిక్యూటివు ఆఫీసరుగా నియమించేనిమిత్తం ప్రభుత్వము ఐ ఎ ఎస్ హోదా ఉద్యోగిని పంపాలి. ఉద్యోగ కాలపరిమితి ఒకే దఫా మూడుసంవత్సరాలకు మించి వుండరాదు.

దేవస్థానం ఎగ్జిక్యూటివు ఆఫీసర్లను ప్రమోటు చేయుటకు, బదిలీచేయుటకు వీలుగా చట్టము కూడా సవరించాలి.

దేవస్థానము క్రింద నిర్మాణాలను, నిర్వహణలను తగిన అర్హతలు కలిగిన సమర్ధుడయిన ఇంజనీరు క్రింద ఏకోన్ముఖం చేయాలి.

ఎగ్జిక్యూటివు ఆఫీసరుకు భారమును తగ్గించేందుకుగాను సర్వవిషయాలను సమగ్రముగా పరిశీలించినమీదట పరిపాలనను వికేంద్రీకరించుటకు చర్యలు తీసుకోవాలి. ప్రతి విభాగమునకు ఒకఅధిపతిని ఏర్పాటుచేసి వారికి పూర్తి బాధ్యతలు యివ్వాలి.

రవాణా, వసతి అకౌంట్సు, ఇంజనీర్సు, పారిశుధ్యం, ఆరోగ్యం, ముద్రణ ప్రచారం లాంటివాటిని విడదీసి ఆ విభాగముల నిర్వహణకు విడివిడిగా వుద్యోగులు ఉండాలి. ఎగ్జిక్యూటివు ఆఫీసరుకు పని వత్తిడిని తగ్గించే నిమిత్తము డిప్యూటీ ఎగ్జిక్యూటివు ఆఫీసరు పదవిని సృష్టించి, వారికి పరిపాలనా భాగాలు కొన్నింటిని ఎగ్జిక్యూటివు అజమాయిషీకి లోబడివప్పగించవచ్చును.

తిరుమలలో పేష్కారుకు సంబంధించిన కొన్ని బాధ్యతలను మరొక వుద్యోగికి దత్తము చేయించవచ్చును.

హుండీ వసూళ్ళను లెక్కపెట్టే సిబ్బంది విస్తృతముగను, గూడుపుఠాణీకి ఆస్కారం లేకుండా బయటవారు ఎక్కువగా వుండే మార్గమును ఆలోచించాలి. ఎప్పటికప్పుడు వచ్చే ఫిర్యాదులను గూర్చి ప్రభుత్వముకాని, కమిషనరు గాని శ్రద్ధ వహించలేదు. పరిపాలనా యంత్రాంగము తగినంతగా వున్నదీ లేనిదీ ఇంతవరకు పరిశీలన జరిగివుండలేదని అంచనాల సంఘం అభిప్రాయపడింది.

దేవస్థానాలలో వివిధ తరగతుల వుద్యోగాలకు సంబంధించి చేర్చబడే నిబంధనలు సేవా నిబంధనలు ప్రత్యేకంగా వుండాలి. రాష్ట్రంలోని విద్యాలయాలన్నింటికి చెందిన పట్టభద్రులకు ఉద్యోగాల విషయములో ప్రాధాన్యమివ్వాలి

"దేవస్థానము రవాణాను ప్రోత్సహించాలి.

జాతీయకరణ అమలుజరిగిన ప్రాంతాలలో పర్మిట్లు యిచ్చే విషయంలో దేవస్థానము రవాణాశాఖలను రోడ్డురవాణా కార్పొరేషను తో సమానముగా చూడాలి.

శ్రీశైలం – తిరుపతి మార్గమును దేవస్థానమునకు తిరిగి యిచ్చివేయాలి.

"ఫలహారశాలల్లో తినుబండారాల నాణ్యతను పెంపొందించుటకు అవకాశాలు ఉన్నాయి. ఈ విషయంలో యాత్రికులకు పుష్టికరమయిన, ఆరోగ్యకరమయిన ఆహారము సరఫరా చేసి దేవస్థానము ఫలహారశాలలు ప్రయివేటు ఫలహారశాలలకు మార్గదర్శకముగా వుండవచ్చును.

యాత్రికులకు దేవుని ప్రసాదము అని చెప్పి దొంగసరకును అమ్మే దుకలవాటును అవసరమైతే శాసనముద్వారా నయినా నిరోధించుటకు చర్యలు తీసుకోనాలి. ఉత్సవ సమయాలలో వసతి కల్పించలేకపోయిన యాత్రికుల కనీస అవసరాల నిమిత్తము దేవస్థానము శ్రద్ధ వహించాలి. తిరుమల తిరుపతిలలో తగినన్ని పాయఖానాలు స్నానాలగదులు ఏర్పాటు చేయాలి.

యాత్రికులపట్ల మర్యాదగా ప్రవర్తించవలసిందిగా సిబ్బందికి ఆదేశాలు యివ్వాలి. అలా వుండనివారిపై అధికారులు తీవ్రమయిన చర్య తీసికోవాలి. అవసరమయితే యాత్రికులతో ప్రత్యక్షముగా వ్యవహరించవలసిన వుద్యోగులకు మర్యాదగా వుండటము నేర్పుటకు శిక్షణ తరగతులను నిర్వహించాలి

వేదగ్రంథాలను, అనువాదాలను, నాలుగు వేదాలకు వ్యాఖ్యానాలను షడ్దర్శనాలను ఉపనిషత్తులు మొదలయినవానిని వివిధ భాషలలో అచ్చువేయించి వివిధ కేంద్రాలలో నామమాత్రము ధరకు విక్రయించాలి.

అనాథ శరణాలయాలకు ఎక్కువ ధనము కేటాయించాలి.

ప్రయాణీకులకు సౌకర్యాలు ఎక్కువచేయాలి.

దేవస్థానము ఇంజనీరింగువర్క్సు గూర్చి కేంద్రీకరించి పనిచేసేనిమిత్తం తిరుపతి కేంద్రముగా ప్రత్యేకముగా ఒక యింజనీరు డైరక్టరును నియమించడము వాంఛనీయమే గాక అవసరం కూడానని అంచనాల సంఘం సిఫార్సు చేశారు.

—*—

శ్రీ పి.యస్. రాజగోపాలరాజు బి.ఏ.బి.యల్, డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమిషనర్, కడప పర్యటన కార్యక్రమం

25–3–64 సాయంత్రం 3 గంటలకు బయలుదేరి సాయంత్రం 7 గంటలకు చిత్తూరు చేరుతారు.

26-3-64 } చిత్తూరు ఆర్. టి. ఓ. ఆఫీసు.
27-3-64 } సాంవత్సరిక ఇన్‌స్పెక్షన్ జరుపుతారు.

28–3–64 సాయంత్రం 4 గంటలకు కారులో బయలుదేరి 7 గంటలకు తిరుపతి చేరుతారు.

29–3–64 ఆదివారం

30-3-64 కారులో ఉదయము 6 గంటలకు కడప బయలుదేరి వెడతారు.

గమనిక:- ఆయా ప్రాంతపు మోటారు ఆపరేటర్లు డిప్యూటీ ట్రాన్సుపోర్టు కమీషనర్ వారిని కలసి సాధక బాధకాలను తెలియ జేసుకొన వచ్చును. ట్రాన్సుపోర్టు కమీషనర్ గారి సలహాలు పొందవచ్చును.



ప్రభుత్వరంగంలో మోటారుకార్ల తయారీ.

నానాటికీ అభివృద్ధిమార్గంలో శీఘ్ర రవాణాకు పనికివచ్చే మోటారుకార్ల వాడకం మన దేశంలో తప్పనిసరి కావటంతో భారత ప్రభుత్వం పబ్లిక్ రంగంలో మోటారుకారుల తయారీ ఫ్యాక్టరీని యేర్పరచే సాహసానికి పూనుకోవాలనుకుంటున్నది.

విదేశ మారకద్రవ్యం తరుగుబడి వుండటం వలన యీ ప్రయత్నం ఇంకా పూర్తి పరిశీలనకు విడువబడలేదు. వాడకందారులఅవసరాన్ని అభిరుచినీ అందుకొనే భారీస్థాయిలో పెద్ద పరిశ్రమగా దీన్ని రూపొందించాలని ప్రభుత్వం వారి యోచన.

సాలుకు లక్ష కారులనన్నా తయారుచేసే శక్తుంటేకాని, ఈ స్థాయిని అందుకోలేమనీ, ఈనాడు దేశంలో లైసెన్సుపొందిన సంస్థలు 20,200 కార్లనుమాత్రమే సప్లయిచేస్తున్నవని మంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం చెప్పారు. అంతేకాక మోటారు పరిశ్రమకై కేటాయింపబడిన విదేశమారకద్రవ్యంలో కొంతభాగం చిన్నతరహా చేతిపరిశ్రమలుగా చెప్పబడే మోటారు విడిభాగాలతయారీలాంటి వాటికి వినియోగింపబడటంవలనకూడా కొఱత వుత్పన్నమయిందని కూడా చెప్పారు.

ప్యాసింజరు కారుల రేట్లు యీనాటికీ హెచ్చుగా వుండటానికి కారణం వాని విడి సామానుల దిగుమతిపై విధింపబడే సుంకాల వల్ల అని తెలియజేశారు.

* * *

పశ్చిమకోస్తాలో కార్వార్ తీరంలో ఓడలకు ఐరన్ వోర్ సరుకును చేరవేసే లారీలు తిరుగు ప్రయాణంలో ఖాళీగా రాకుండా వానిపై ఆహార పదార్థాలూ, యెరువులూ చేరవేసేందుకు వీలుగా యేర్పాట్లు చేయబడుచున్నవని రాజ్ బహద్దూర్ చెప్పారు.

జాతీయరహదార్లపై వసతి గృహాలు.

దేశంలో పది రాష్ట్రాలలో 373 వసతి గృహాలు జాతీయ రహదారులపై గలవని, వీని వినియోగం విషయంలో తగిన శ్రద్ధవహింపబడి ప్రయారిటీ ప్రకారం యేర్పాట్లుచేయబడుచున్నవని తెలియజేశారు.

రోడ్డుట్రాన్సుపోర్టు కార్పొరేషన్లు.

కేంద్రప్రభుత్వంవారి సిద్ధాంతం ప్రకారం 1950 రోడ్ ట్రాన్సుపోర్టు యాక్టు ననుసరించి ఏర్పడిన సంస్థలు మాత్రమే రోడ్డు రవాణా జాతీయీకరణ పథకాన్ని అమలుపరచవలసి వుందనీ అందునిమిత్తమై కేంద్రప్రభుత్వం రెండు రాష్ట్రాలలో 14 కోట్ల రూపాయలు వెచ్చించిందని రోడ్డు-రైలు రవాణాల సమన్వయ సాధనను సాగిస్తూ ప్రయాణసౌకర్యాల్ని యినుమడింప జేసేందుకు ప్రణాళికలు తయారుచేసుకొనే బాధ్యత రాష్ట్రప్రభుత్వాలకే వదలివేయబడిందనీ, పెట్టుబడి మొత్తంమీద 10 సం. కాలంలో సుమారు 3 కోట్ల రూ|| లు ఆదాయం వచ్చిందనీ తెలియజేయబడింది.

గ్రాము : 'పార్సిల్స్'   ఫోను : 2378 పి. పి.

శ్రీ వెంకటేశ్వర ట్రాన్సుపోర్టు

(రిజిష్టర్డు)

గూడ్సు అండ్ పార్శిల్ సర్వీస్

హెడ్డాఫీసు : గోపాలరెడ్డి రోడ్డు, విజయవాడ—2.

బ్రాంచీలు : తారాపేట, విజయవాడ—1. ఫోన్ : పి. పి. 847

గాంధీనగరం, విజయవాడ—3.

16/1, 4-మెయిన్‌రోడ్డు, న్యూతర్గుపేట, బెంగుళూరు—2.

93, వరదముత్తి అప్పన్‌వీధి, మద్రాస్—1.

అత్తితోట, అగ్రహారంవీధి, నెల్లూరు.

పట్నంబజారు, గుంటూరు.

రాష్ట్రపతి రోడ్డు, సికింద్రాబాద్.

ముత్యార్‌గంజ్, సిద్దింబజార్, మశీదువద్ద, హైదరాబాద్. ఫోను : 4485

5-4-354, జుమరాత్ బజార్, నిజామాబాద్.

ఆంధ్రా బ్యాంకు రోడ్డు, పవరుపేట, ఏలూరు.

ఓల్డు బస్‌స్టాండు, మచిలీపట్నం.

చిత్తూరు, తిరుపతి, కావలి, ఒంగోలు, గుడివాడ పట్టణములందు ఏజన్సీలు కావలసినవారు పై అడ్రసుకు వ్రాసి వివరములు తెలుసుకోవచ్చును.

హైదరాబాద్-విజయవాడ-మద్రాసు-బెంగుళూరులమధ్య డైలీ పార్సిల్‌సర్వీసు నడుపబడుచున్నది.